# పిరికి సర్కారు



## అందుకే సభ అర్ధాంతర వాయిదా
## ఆస్తులపై విచారణ జరగాల్సిందే
## ఎన్నికల్లోపు తేలాలి
## కాంగ్రెస్ అవినీతి బయటపెట్టాం: చంద్రబాబు

హైదరాబాద్ - న్యూస్‌టుడే

ఎమ్మెల్యేల ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించే విషయంలో ప్రభుత్వం పిరికితనంతో వ్యవహరిస్తోందని తెదేపా అధినేత చంద్రబాబు దుయ్యబట్టారు. "విచారణ జరిపించాలని సభ యావత్తూ సోమవారం ఏకగ్రీవ్రంగా కోరింది. దీనిపై మంగళవారం తీర్మానం ఉంటుందని సీఎం హామీ ఇచ్చారు. కానీ ఈరోజు (మంగళవారం) సభలో దీని ప్రస్తావనే తేకుండా అసెంబ్లీని నడిపించారు. పిరికితనంతో అర్ధాంతరంగా వాయిదా వేసుకుపోయారు. పాలకపక్షం పారిపోతోంది. సభ్యుల ఆస్తులపై న్యాయవిచారణ దిశగా బుధవారం సభలో పట్టుబడతాం" అని బాబు అన్నారు. మంగళవారం అసెంబ్లీ ఆవరణలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎమ్మెల్యేల ఆస్తులపై న్యాయ విచారణ ప్రక్రియ ఎన్నికల్లోపే పూర్తి కావాలన్నారు. "అందరి ఆస్తులపై విచారణ జరిగితే... ఎవరు నీతిమంతులో ఎన్నికల నాటికి తేలిపోతుంది. ప్రజలకన్నీ తెలియాలి" అని చెప్పారు. 1978 నుంచి సభ్యుల ఆస్తులపై న్యాయవిచారణ జరిపినా తమకు అభ్యంతరం లేదని తెలిపారు. అయితే ఆ పేరుతో విచారణను ప్రక్రియను నీరుకార్చేందుకు సర్కారు యత్నించకూడదని స్పష్టంచేశారు. "1978 నుంచే కాదు.. రాష్ట్రం ఏర్పడ్డప్పటి నుంచి ఎమ్మెల్యేల ఆస్తులపై విచారణ జరిపించినా మాకు అభ్యంతరం లేదు. ఈ ప్రభుత్వం అవినీతి ఊబిలో కూరుకుపోయింది. అధికారపార్టీ ఎమ్మెల్యేలు కాంట్రాక్టర్ల అవతారమెత్తి.. దోపిడీకి పాల్పడుతున్నారు. సర్కారు భూములు కొల్లకొడుతున్నారు. ఖనిజ సంపద లూటీ జరుగుతోంది. ఆ అక్రమాలను సాక్ష్యాధారాలతో బయటపెట్టాం. వీటిపై విచారణ జరగాలన్నదే మా వాదన" అని ఆయన చెప్పారు. అవిశ్వాసంపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా... కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో అవినీతిపరులు, భూకబ్జాదారులే వైఎస్‌ను వెనకేసుకొస్తున్నారని ధ్వజమెత్తారు.

### మరో సీఎంను పెట్టుకుంటారు

"వైఎస్ రాష్ట్రానికి ముఖ్యమంత్రా? లేక ఇడుపులపాయకు మాత్రమేనా? ... ఈ సంగతిని ఆయనే స్పష్టంచేయాలి. దాన్ని బట్టి కాంగ్రెస్ వాళ్లు రాష్ట్రానికి మరో సీఎంను పెట్టుకుంటారు" అని బాబు దుయ్యబట్టారు. సొంత కుటుంబం, సొంత ఆస్తులు, సొంత ఊరు అభివృద్ధి చెందితే చాలన్న రీతిలో వైఎస్ వ్యవహరిస్తున్నారన్నారు. "తన ఆస్తుల విలువ పెంచుకునేందుకు సొంత ఎస్టేట్ ఉన్న ఇడుపులపాయ వద్ద దాదాపు రూ. 8000 కోట్లను వైఎస్ వెచ్చిస్తున్నారు. ప్రభుత్వ నిధులన్నింటినీ సొంత నియోజకవర్గంలో ఖర్చుపెడుతున్న సీఎం... రాష్ట్రంలోని మిగతా నియోజకవర్గాలకు ఏం చేశారో చెప్పాలి? సమగ్ర జలవిధానం, తెలంగాణ సమస్య ఇలా రాష్ట్రానికి సంబంధించిన ఏం అంశంపై వైఎస్ సమాధానం చెప్పడం లేదు" అని విమర్శించారు. కడప జిల్లాలోనూ పులివెందులను తప్ప మరే ఇతర నియోజకవర్గాన్నీ సీఎం అభివృద్ధి చేయడం లేదన్నారు. కుప్పం నియోజకవర్గంపై వైఎస్ కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సేవలందిస్తున్న ఎన్టీఆర్ ట్రస్టుపైనా, తాను ఇల్లు కొనుక్కోవడంపైనా చౌకబారు ఆరోపణలు చేయడం కాంగ్రెస్‌కే చెల్లిందన్నారు. సీఎం తనయుడి పత్రికలో పెట్టుబడులు పెట్టిన వారికి వైఎస్ ఏమేం చేశారో వెల్లడించాలని బాబు డిమాండ్ చేశారు. తెదే హయాంలో ఏ పత్రికా యాజమాన్యానికీ మేలు చేసే చర్యలు తీసుకోలేదని స్పష్టంచేశారు.

### దొంగలు పడ్డ ఆర్నెళ్లకు..

నిత్యావసరాల ధరల నియంత్రణకు కేంద్రం ఉపక్రమించిన వైనం... దొంగలుపడ్డ ఆరునెల్లకు కుక్కలు మొరిగిన చందంగా ఉందని తెదే అధినేత విమర్శించారు. ధరలను అదుపులో పెట్టేందుకు కేంద్రం ప్రకటించిన చర్యలు సహేతుకం కాదన్నారు. "బియ్యంతో పాటు ఆహార ధాన్యాల ఎగుమతులను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీచేయడం వల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది. సమస్య మూలాల్లోకి వెళ్లకుండా... కంటితుడుపు చర్యలతోనే సరిపెట్టుకుంటున్నారు. సమస్య ఒకటైతే... పరిష్కారం మరోటి చూపుతున్నారు" అని దుయ్యబట్టారు. ఆహార ధాన్యాల కొరతే ధరల పెరుగుదలకు కారణమని చెప్పారు.